తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

24, 25తేదీల్లో సిఎం చంద్రబాబు కుప్పం పర్యటన

- కుటుంబసమేతంగా గృహప్రవేశంకు హాజరు..?



కుప్పం,మే 14 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం అయిన కుప్పంలో ఈనెల 24, 25 తేదీల్లో పర్యటించనున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం కదిరి ఓబనపల్లి వద్ద సిఎం చంద్రబాబునాయుడు సుమారు రెండెకరాల్లో స్వగృహం నిర్మిస్తున్న విషయం విదితమే. గృహ నిర్మాణం పూర్తవుతున్న నేపథ్యంలో ఈనెల 25వతేది గృహప్రవేశ కార్యక్రమం జరపాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిఎం చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా హాజరు అవుతారని తెలిసింది. అందుకోసం ఈనెల 24వతేదినే సిఎం కుటుంబీకులు కుప్పం చేరుకుంటారని సమాచారం. అధికారికంగా పర్యటన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పల్లె పండుగ పనులు వేగవంతం : కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, మే 14 ప్రభాతవార్త

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పురోగతిలో ఉన్న పలు అభివృద్ధి పనులను ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, పంచాయితీ డ్వామా, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో పల్లె పండుగలో భాగంగా మంజూరైన సీసీ రోడ్లు పనుల పురోగతిపై వర్చువల్‌గా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పల్లెపండుగ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. ఎక్కడా పల్లె పండగ పనుల్లో అలసత్వం వహించరాదని హెచ్చరించారు. అందరి సహకారంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

వైభవంగా గంగమ్మ నిమజ్జనం

- గగుర్పాటుకు గురి చేసిన ఓంశక్తి భక్తుల విన్యాసాలు

చిత్తూరురూరల్, మే 14 ప్రభాతవార్త:

చిత్తూరు నడివీధి గంగమ్మ నిమజ్జనం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. చిత్తూరు నడివీధి గంగమ్మతో పాటు కొంగారెడ్డిపల్లి, మురకంబట్టు, దొడ్డిపల్లి, గిరింపేట, సంతపేట ప్రాంతాల్లో రెండు రోజులుగా గంగ జాతర ఉత్సవాలు జరుగుతున్నాయి. చిత్తూరు నడివీధి గంగమ్మ బుధవారం తెల్లవారుజాము నుండి సాయంత్రం వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్గించి ఆపై రాత్రి 7 గంటల ప్రాంతంలో నిమజ్జనంకు బయలుదేరింది. గంగమ్మ నిమజ్జనానికి బయలుదేరడానికి ముందు ఓం శక్తి భక్తులు నిర్వహించిన విన్యాసాలు అందరి శరీరాలను గగుర్పాటు చేశాయి. సుమారు 2 వేల మంది ఓం శక్తి భక్తులు నాలుకలకు శూలాలు గుచ్చుకోవడం, వీపులో రంధ్రాలు చేసుకుని తాళ్ళు కట్టుకుని లారీ, ఆటో, జీపులను లాక్కెళ్ళడం, ఇరు చెంపలకు నిమ్మకాయలు వున్న శూలాలు గుచ్చుకుని వెళ్ళడం లాంటి గగుర్పాటు సన్నివేశాలు గంగజాతరలో అందరిని గగుర్పాటుకు గురి చేశాయి. అనంతరం నిమజ్జనంకు బయలుదేరిన గంగమ్మకు భక్తులు పూజలు నిర్వహించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. చిత్తూరు నడివీధి గంగమ్మ నిమజ్జనంకు చిత్తూరు నగరం, దాని పరిసర ప్రాంతాల్లోని భక్తులతో పాటు తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం, వేలూరు, తిరుత్తణి, శోలింగర్, పొన్నై, చెన్నై, కర్నాటక రాష్ట్రం బెంగళూరు, బళ్ళారి, ముళ్‌బాగల్ తదితర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి గంగమ్మను భక్తిశ్రద్ధలతో దర్శించుకుని మొక్కబడులు తీర్చుకున్నారు. గంగమ్మ నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా చిత్తూరులో పోలీసులు మధ్యాహ్నం 3 గంటల నుండి ట్రాఫిక్ మళ్ళింపులు చేపట్టారు. మధ్యాహ్నం 3 గంటల నుండి చిత్తూరు నగరంలో గంగ జాతర జరిగే ప్రదేశాల్లో ఏ ఒక్క వాహనంను అనుమతించలేదు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి చిత్తూరు బస్టాండ్‌కు వచ్చే బస్సులను ట్రాఫిక్ మళ్ళించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. నిమజ్జనానికి బయలుదేరిన గంగమ్మ చిత్తూరు హైరోడ్డు చేరుకోవడంతో అక్కడ ఓం శక్తి భక్తులు గాలిలో వ్రేలాడుతూ వచ్చి గంగమ్మకు గజమాల వేశారు. అక్కడి నుండి కట్టమంచి చెరువుకు చెరువుకు చెరుకొని గంగమ్మను నిమజ్జనం చేశారు.

ప్రశాంతంగా ముగిసిన గంగమ్మ జాతర

-విశ్వరూపం చెంప తొలగింపులో ఉద్రిక్తత

తిరుపతి(రవాణ)మే 14ప్రభాతవార్త

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర వారంరోజు పండుగ బుధవారం వేకువజామున గంగమ్మవిశ్వరూప ప్రతిమ చెంపను పేరంటాలు తొలగించడంతో ప్రశాంతంగా ముగిసింది. ఆలయంలో,ఆలయం వద్ద పూర్తిస్థాయిలో భద్రత కల్పించారు. పేరంటాలు ఆలయంకు వచ్చినపుడు ఆలయ సిబ్బంది తగిన సౌకర్యాలు కల్పించలేదని కొంతసేపు ఆలిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆ తరువాత కొందరు కలుగజేసుకుని పేరంటాలకు నచ్చ చెప్పడంతో చెంప తొలగించి ఆ మట్టిని భక్తులకు అందజేశారు. ఈ మట్టిని ఇళ్లలో ఉంచుకుని చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు ఎదురైనపుడు నీటితో కలిపి సేవిస్తే నయమవుతుందని భక్తుల విశ్వాసం. తిరుపతి నగర డిఎస్పీ భక్తవత్సలం, క్రైమ్ డిఎస్పీ శ్యామ్‌సుందర్, సిఐలు రామకిశోర్, శ్రీనివాసులు, మురళీమోహన్. ఎస్ఐలు, పోలీసులు సిబ్బంది భారీ భద్రతలో నిమగ్నమయ్యారు.

గంగమ్మతల్లీ మన్నించు!

ఆధిపత్యపోరులో పేరంటాల్ని పట్టించుకోని ఆలయ కమిటీ అవగాహన లేక గంగమ్మజాతర అభాసుపాలు

తిరుపతి(రవాణ),మే 14ప్రభాతవార్త:

రాయలసీమజిల్లాల్లోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతరముగింపు వేడుకల్లో ఆలయ సిబ్బంది ఆధిపత్యపోరు, కమిటీ అవగాహనరాహిత్యంతో విశ్వరూపం ప్రతిమ చెంప తొలగింపుకు వచ్చిన పేరంటాలుకు తీవ్ర అవమానం జరిగింది. తెల్లవారుజామునపేరంటాలు ఆలయంకు చేరుకునే ముందు గుడి గేట్లన్నీ మూసేయడంతో తనవారితో లోపలకు రావడానికి వీలులేకుండా పోయింది. ఆలయసాంప్రదాయాలకు తిలోదకాలిచ్చేయడంతో పేరంటాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం, వెనుకదిరిగి వెళ్ళడంతో ఆలయ సిబ్బంది విషయం తెలుసుకుని చివరకు శాంతింపజేసి విశ్వరూపం చెంప తొలగించడంతో జాతర ముగిసింది. ఈ ఏడాది జాతర నిర్వహణ, జాతర వేడుకలు పేలవంగా మారడం, చివరకు వేషాలుతో భక్తులు కూడా పెద్దగా ఆలయానికి రాలేదు. అయితే జాతర కమిటీ రాజకీయకమిటీగా మారడంతో ఎవరి ఇష్టానుసారంగా వాళ్ళు తమవారికి దర్శనాలు చేయించడంలో ఉన్న శ్రద్ధ ఆలయంలో సాంప్రదాయాలపై లేకపోయిందనేది భక్తులు ఆవేదన. జై గంగమ్మ, ఓంశక్తి నినాదాలతో ఆలయంలో భక్తులు నినదించాల్సి ందిపోయి టిడిపి,జనసేన పార్టీల నాయకుల మధ్య ఆధిపత్యపోరుతో పేరంటాలకు అవమానం జరిగింది. భక్తులు గంగమ్మతల్లీ మన్నించు అమ్మా అంటూ వెనుదిరిగారు. కాగా సోమవారం రాత్రి శాంతిఅభిషేకం ప్రణాళికతో నిర్వహించిన ఆలయ ఈఓ జయకుమార్ విశ్వరూపం చెంప తొలగింపువేళ అభాసుపాలయ్యారు.

పోలీస్ స్టేషన్ ఎదుట కారు దగ్ధం

తవణంపల్లి, మే 14 ప్రభాతవార్త:

స్పీడ్ బ్రేకర్ల వద్ద బ్రేకులు వేయడంతో హఠాత్తుగా మంటలు చెలరేగి కారు దగ్ధమైన సంఘటన మండల కేంద్రం తవణంపల్లి పోలీసు స్టేషన్ ఎదుట బుధవారం సాయంత్రం జరిగింది. వివరాలిలా వున్నాయి. తిరుపతి నగరానికి చెందిన శివప్రసాద్, తారక్, తేజ అనే వ్యక్తులు బుధవారం ఉదయం మండలంలోని టి.పుత్తూరు గ్రామంలోని తమ సమీప బంధువుల ఇంటికి వచ్చారు. వీరు మధ్యాహ్నం ఇంట్లో భోజనం చేసిన అనంతరం కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. వీరు పోలీస్ స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద కారుకు బ్రేక్ వేయడంతో కారులో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమై కారులో ప్రయాణిస్తున్న శివప్రసాద్, తారక్, తేజలు కారులో నుండి దిగి బయటికి వచ్చేశారు. మంటలు భారీగా చెలరేగడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కల్పవృక్ష, సర్వభూపాలవాహనాలపై

మువ్వగోపాలుని సాక్షాత్కారం



నారాయణవనం, మే 14 ప్రభాతవార్త :

నారాయణవనం పుణ్యక్షేత్రంలో వెలసిన పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు బుధవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై మువ్వాగోపాలుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీవారు ఊరేగారు. రాత్రి 7గంటలకు సర్వభూపాలవాహనంలో సీతారామ సమేత లక్ష్మణుని అవతారంలో నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సర్వభూపాలవాహనంపై మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటం, కేరళ వాయిద్యం, చెక్కభజనల నడుమ స్వామివారు ఊరేగారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. భక్తులకు టిటిడి అధికారులు శ్రీవారి మహాప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఇఓ నాగరత్న, ఎఇఓ రవి, సూపర్‌టెండెంట్ ధర్మయ్య, సివిల్ ఇంజనీరింగ్ ఎఇఇ గురుప్రసాద్, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్‌పెక్టర్ భరత్, అర్చకులు శ్రీధర్‌భట్టాచార్యులు, నరసింహరాఘవ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు నారాయణవనంలో గరుడసేవ :

నారాయణవనం కల్యాణవేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోతవాల్లో అతి ముఖ్యమైనా దినం గరుడసేవ గురువారం రాత్రి 7నుంచి9.30 వరకు నిర్వహించడానికి టిటిడి అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. ఉదయం 7.30 గంటలకు పల్లకీసేవ, మోహిని అవతారంలో శ్రీవారుపురవీధుల్లో ఊరేగనున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

శ్రీకాళహస్తిరూరల్,మే 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి తిరుపతి జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. బుధవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మరణించగా, పలువురు గాయపడ్డారు. శ్రీకాళహస్తి మండలం లాంకో సమీపంలో ఓ టెంపో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడగా ఒకరు మృతి చెందారు. పులువురు గాయపడ్డారు. అదేవిధంగా ఏర్పేడు మండలం మేర్లపాక దళితవాడ సమీపంలో వేకువ జామున జరిగిన ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఇద్దరు మృతి చెందారు.దాంతో రెండు చోట్ల విషాదం చోటుచేసుకుంది. రెండు ప్రమాదాల్లో డ్రైవర్లు నిర్లక్ష్యం,నిద్రమత్తుతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇటు శ్రీకాళహస్తి రూరల్, అటు ఏర్పేడు పోలీసులు పరుగులు తీసారు.

టెంపో బోల్తా: ఒకరు మృతి, పలువురికి గాయాలు

శ్రీకాళహస్తి రూరల్ పరిధిలోని లాంకో సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన టెంపో బోల్తా సంఘటనలో ఒకరు మృతి చెందగా 17 మందికి గాయలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారికి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స జరిపి మెరుగైన సేవలకు తిరుపతి రుయాకు తరలించారు. వివరాలు సిఐ రవినాయక్ అందించిన మేరకు.. బెంగుళూరుకు చెందిన 18 మంది టెంపోను బాడుగకు తీసుకొని తిరుమలేశుని దర్శనంతో పాటు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి ప్లాన్ చేసుకున్నారు. తిరుమల దర్శనం తరువాత శ్రీకాళహస్తికి వస్తున్న టెంపో జాతీయ రహదారిపై డివైడర్‌కు ఢీకొన్నట్లు బాధితుల్లో ఒకరు తెలిపారు.

పలువురికి గాయాలు

టెంపో బోల్తా ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళలు

దాంతో టెంపోలో ఉన్న అందరూ గాయపడ్డారు.వీరిలో బాలాజి ఆసుపత్రికి పంపిన వారిలో శుభం అనే మహిళ మృతి చెందగా మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు. గాయపడ్డ వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రి ఆవరణ హాహాకారాలు ఆర్తనాదాలు చోటు చేసుకున్నాయి. తీవ్రగా గాయపడిన వారిలో రేష్మాశెట్టి(38)రవిశెట్టి (48) వేణుగోపాల్(43) మంజూల(36),శుజల శెట్టి (66)గార్విశెట్టి (23) ఉతప్పగౌడ(70),మధుబాబు (46),వృద్వీశెట్టి (6), విహాన్ (8),పురవ్ (15) తీవ్ర గాయాలకు గురికాగా వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించి తిరుపతి రుయాకు తరలించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసు సిఐ రవినాయక్

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కోళ్ల లారీ : ఇద్దరు మృతి

శ్రీకాళహస్తిరూరల్,మే 14 ప్రభాతవార్త

ఏర్పేడు మండలం మేర్లపాక దళితవాడ వద్ద అన్నమయ్యజిల్లా నుంచి మట్టిని తీసుకెళుతున్న లారీ పార్కింగ్ చేసి ఉండగా కోళ్ల లారీ ఢీకొంది. ఈ కోళ్లన లారీ ఈ నెల 13న సేలం నుంచి నాటుకోళ్ళు లోడుతీసుకొని బయలుదేరారు. బుధవారం వేకువ జాము 2.45 ప్రాంతంలో ఏర్పేడు దాటుతూనే రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కోళ్ల లారీ డ్రైవర్ కృష్ణన్ పెరుమాళ్, పక్కన కూర్చొన్న రాజన్ మధు మృతి చెందారు. అతి కష్టంమీద మృతదేహాలను పోలీసులు బయటకులాగారు. మృతదేహాలను శ్రీకాళహస్తి ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బోలేరో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. కేసు దర్యాప్తులో ఉంది.

కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ జాతర మొదలు

- శ్రీ వినాయక విగ్రహం ఊరేగింపుతో శ్రీకారం !!

కుప్పం, మే 14 ప్రభాతవార్త

జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ జాతర బుధవారం ఘనంగా మొదలైంది. బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో శ్రీ వినాయకస్వామికి ప్రత్యేక పూజల అనంతరం విగ్రహ ఊరేగింపుతో జాతరకు శ్రీకారం చుట్టారు. స్వామివారి ఉత్సవాన్ని పురవీధుల్లో ఊరేగించారు. 15వతేది నుంచి 18వతేది వరకు శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ ఉత్సవాలను నిర్వహిస్తారు. 19న శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ అగ్నిగుండ ప్రవేశం, బాణ వేడుకలు, 20న శ్రీ తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపు, 21న శ్రీ తిరుపతి గంగమ్మ తల్లి విశ్వరూప దర్శనంతో జాతర ముగియనుంది. జాతర సందర్భంగా ఈనెల 17, 18వ తేది కుప్పం బస్టాండులో సినీ గాయకులు, డ్యాన్సర్లచే ప్రదర్శనలు నిర్వహిస్తారు.

కష్టాల ఊబిలో శ్రీకాళహస్తి మున్సిపాలిటీ!

చెత్త వాహనాల మర్మమతులు పట్టించుకొని వైనం -పెట్రోల్ బంకుకు రూ.50లక్షలు బకాయి

సిబ్బంది కొరతతో పారిశుధ్యం ఆగమ్యగోచరం -వారంలో ఒక్క రోజుకూడా కాల్వలు శుభ్రం చేసే పరిస్థితిలేదు

శ్రీకాళహస్తి,మే 14 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి మున్సిపాలిటి కష్టాల కడలిలో ఊగిసలాడుతూ, ఆర్థిక సంక్షోభం ఊబిలో కూరుకుపోయింది. రోజూ వేలాది మంది భక్తులు సందర్శించించే ఇలాంటి పట్టంలో పారిశుధ్యం అధ్వాన పరిస్థితిలో వుంది. ఒక్క పెట్రోల్ బంక్‌కే రూ.50లక్షల బకాయి ఉన్నట్లు సమాచారం. దాంతో ఆ బంకు యజమాని ఇక సరఫరా చేయటమా? లేక ఆపివేయటమా అనే సందిగ్ధంలో ఉన్నారు. ఒక వేళ ఆయన సహాయనిరాకరణ చేస్తే పట్టణంలో పారిశుధ్యం పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ మున్సిపాలిటిలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు సొమ్ములు చెల్లించపోగా, పని చేసిన వారికి బిల్లులు చెల్లించకుంటే తిరిగి పనులు ఎలా చేస్తారు? అనేది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పారిశుధ్యం ప్రశ్నార్థకంగా ఉంది. పట్టణంలో వారంలో ఒక రోజు కూడా కాల్వలు శుభ్రం చేసే పరిస్థితిలేదు. దీనికి కారణం కార్మికుల కొరత వెంటాడుతున్నది. చెత్త సేకరించే వాహనాలు దాదాపుగా మరమ్మతులకు గురై మూలన పడివున్నాయి. ఈ వాహనాలు అన్నీ వస్తే తప్ప పూర్తి స్థాయిలో చెత్త సేకరణ జరిగే పరిస్థితి లేదు. దీంతో పారిశుధ్యం కార్మికులు తమ వంతు పారిశుధ్య సిబ్బంది కొంత మేరకు పనిచేస్తున్నా, కార్యాలయ సిబ్బంది తమ పనులు చక్కబెట్టుకొనే పనిలో వున్నారు. నెలాఖరుకు ఇప్పుడువున్న కమిషనర్ పదవీ విరమణ చేయునున్నారు. కమిషనర్ కూడా తమకెందుకు ఈ బిల్లుల గోల అన్నట్లు వున్నారు.

ప్రభుత్వం విధానాలపై స్పష్టత లేదు:

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో బకాయిల చెల్లింపులకు సంబంధించి మూడు నెలలుగా గందరగోళంగా మారింది. పనులు చేసిన కాంట్రాక్టర్ల బిల్లులను గత ప్రభుత్వం నిబంధనల మేరకు ఆడిట్ జరిపి సిఎఫ్ఎంఎఫ్‌కు పంపుతారు. అక్కడ నిధుల అందుబాటులో బట్టి చెల్లింపులు చేస్తారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాత విధానాన్నే అమలు చేయాలని భావించారు. అప్పటికే సిఎఫ్ఎంఎఫ్ వద్ద సుమారు రూ.కోటి లకు పైగా బకాయిలు ఉన్నట్లు సమాచారం. రెండు నెలలుగా బకాయిల చెల్లింపులకు సంబంధించి పనులు చేసిన వారు మున్సిపాలిటి చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ సమాధానం చెప్పె దిక్కులేక అవస్థలు పడుతున్నారు. జనరల్‌ఫండ్‌కు సంబంధించి బిల్లులు సిఎఫ్ఎంఎఫ్ ఆమోదంతో చెల్లింపులు జరగాల్సి ఉండటంతో జాప్యం చోటు చేసుకుంది.

గంగమ్మ జాతర వేడుకలకు కట్టుదిట్టమైన బందోబస్తు

-అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు : ఎస్పీ

పలమనేరు, మే 14 ప్రభాతవార్త: పలమనేరులో గంగమ్మ జాతరకు కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆలయాన్ని ఆయన సందర్శించి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 350 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 14 రాత్రి గంగమ్మ శిరస్సు ఊరేగింపు, 15 జాతర ఉత్సవం, నిమజ్జనం సందర్భంగా ప్రతి ప్రాంతంలోని రోడ్లపై సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. తమ సిబ్బంది ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ ద్వారా సిసి కెమెరాలను పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. అదనంగా డ్రోన్ కెమరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఏరియల్ పర్యవేక్షణ ఉంటుందన్నారు. రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక సిబ్బంది తోకలసి పర్యవేక్షణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్పీ ప్రభాకర్, పలమనేరు సిఐ నరసింహరాజు, గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్, ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డి మండల పర్యటన

చౌడేపల్లి, మే 14 ప్రభాతవార్త

మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం మండలంలో పర్యటించారు. మండలంలోని చింతమాకులపల్లి పంచాయతీ బయప్పల్లిలో రామచంద్రారెడ్డి, కాగతి పంచాయతీ ఎల్లంపల్లిలో సదానందరెడ్డిల కుటుంబాల్లో నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదే విధంగా పరికిదొన బాబు గృహ ప్రవేశానికి హాజరయ్యారు. మండల వైకాపా అధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి, రాష్ట్ర వైకాపా విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్‌భరత్, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, మండల ఉపాధ్యక్షులు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీఎంపిపికూరపర్తిఅంజిబాబు, మండలంలోనివైకాపానాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమిటీలతోనే పార్టీ బలోపేతం : గువ్వల

చౌడేపల్లి, మే 14 ప్రభాతవార్త



కమిటీలతోనే పార్టీ బలోపేతం అవుతుందని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. మండలంలోని దిగువపల్లి, కాగతి పంచాయతీల తేదేపా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నూతన కమిటీలు పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి పటిష్టతకు కృషి చేయాలన్నారు. దిగువపల్లి, కాగతి పంచాయతీల అధ్యక్షులుగా భూషణం, రాధాకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. బోయకొండ సుబ్బు, సోము, రెడ్డి, మనీ, ముస్లిం మైనార్టీ సభ్యులు పాల్గొన్నారు.

17న ఎస్సీ ఎస్టీ మానటరింగ్ సమావేశం

చౌడేపల్లి, మే 14 ప్రభాతవార్త

ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ సమావేశాన్ని ఈనెల 17న నిర్వహించనున్నట్లు తహశీల్దార్ హనుమంతు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్థానిక మండల పరిపాలనా భవనంలో జరిగే సమావేశానికి ఎస్సీ, ఎస్టీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రొంపిచెర్లలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పర్యటన

రొంపిచెర్ల, మే 14 ప్రభాతవార్త:

మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సవ్వాలవాండ్లపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన విశ్వనాథ నాయుడు కర్మ క్రియలకు హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచ్ నాగిరెడ్డి, జీవలత, వైఎస్ఆర్సీపీ నాయకులు కరిముల్లా, అల్లా బక్సు, మహబూబ్ బాషా, మంజూర్, శ్రీనాథ్ నాయుడు, ముని కృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి దేవేంద్ర రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, కోటా వెంకటరమణ, సూర్యనారాయణ రెడ్డి, నాగరాజు, సురేంద్ర నాయుడు, సైఫుల్లా ఖాన్ పాల్గొన్నారు.

ఇళ్ళ నిర్మాణ పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు

చిత్తూరురూరల్, మే 14 ప్రభాతవార్త: ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి యాక్టివ్ లబ్దిదారులను గుర్తించి వారికి నిర్మాణాలు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ళను నిర్మించుకోవడానికి యాక్టివ్‌గా వున్న లబ్దిదారులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి గుర్తించాలని, లబ్దిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రుణాల మంజూరుపై అవగాహన కల్పించి త్వరితంగా ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సమన్వయం చేసుకుని ఇళ్ళ నిర్మాణాల పురోగతిని సమీక్షించుకోవాలని ఆదేశించారు. జిల్లాకు మొత్తం 77,366 ఇళ్ళు మంజూరు కాగా అందులో 50,539 ఇళ్ళ నిర్మాణాలు పూర్తి కాగా 8,562 ఇళ్ళు పునాది స్థాయిలో, 4,504 ఇళ్ళు రూఫ్ లెవల్ స్థాయిలో వున్నాయన్నారు. ఇళ్ళ నిర్మాణాలు పూర్తయిన గృహాలకు సంబంధించి ఎఫ్‌టిఓలను జనరేట్ చేయాలని సూచించారు. ఎఫ్‌టిఓ జనరేట్ చేసిన వాటికి బిల్లుల చెల్లింపు త్వరితంగా జరుగుతుందన్నారు. హౌసింగ్ పిడి గోపాల్‌నాయక్, హౌసింగ్ ఇఇలు, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్

చిత్తూరురూరల్, మే 14 ప్రభాతవార్త:

ఒకే పాఠశాలకు చెందిన ఐదు మంది విద్యార్థులు లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కావడంతో వారికి బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదు మంది విద్యార్థులు లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సంపాదించుకోవడంతో పాఠశాల గణిత ఉపాధ్యాయుడు అరుణశివప్రసాద్ విద్యార్థులతో కలిసి బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులు సాధించిన ప్రతిభ, రికార్డులను అడిగి తెలుసుకుని అభినందించారు. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని ఎ.లహరి పై యొక్క విలువను మొదటి 1000 దశాంశాలను నాలుగు నిమిషాల 55 సెకండ్లలోను టెన్త్ విద్యార్థి కె.పునీత్ సాయి 1000 నుండి 2,000 వరకు ఏడు నిముషాల 31 సెకండ్లలోను, హేమ అనే విద్యార్థి 2001వ దశాంశము నుండి మూడు వేల దశాంవాల వరకు 8 నిముషాల 11 సెకండ్లలో, రేవతి అనే విద్యార్థిని 3,000 దశాంశము నుండి 3,600 దశాంశాల వరకు 8 నిముషాల్లో చెప్పింది. వీరి ప్రతిభను గుర్తించి లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వీరి పేరు నమోదు అయ్యింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సంపంగి, భారతి, సంజీవి, పిల్లారప్ప, పాపుదేసి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపిటిసి రామచంద్రారెడ్డి మృతి

కుప్పంరూరల్, మే 14 ప్రభాతవార్త తెదేపా సీనియర్ నేత, వెందుగంపల్లి మాజీ ఎంపిటిసి సభ్యుడు రామచంద్రారెడ్డి బుధవారం మృతి చెందారు. గతకొంత కాలంగా అనారోగ్యంతో ఆయన బాధపడేవారు. ఈయన మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపిపి చౌడప్ప, రాష్ట్ర నేతలు గోపీనాథ్, డా॥ వెంకటేష్ తదితరులు వెందుగంపలి చేరుకుని రామచంద్రారెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం- భయందోళనలో ప్రజలు

- తెగిన తీగలను పట్టించుకోని అధికారులు



వెదురుకుప్పం, మే 14 ప్రభాతవార్త : మండలంలోని టిఆర్.పురం సమీపంలో అమర్చిన విద్యుత్ తీగలు బలమైన గాలివానకు తెగికిందపడిన ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోలేదని భయందోళనకు గురికావలసి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల కథనం మేరకు... మండలంలోని టికెయం.పురం పంచాయితీ పరిధిలోగల టిఆర్.పురం సమీపంలో మూడు రోజుల క్రితం కురిసిన బలమైన గాలివానకు తెగికిందపడిపోయింది. అప్పటి నుంచి విద్యుత్ తీగలు నేలపై ఉన్నాయి. నిత్యం జనం, జంతువులు తిరుగు ప్రాంతంలో విద్యుత్ తీగలు తెగి నేలపై పడి ఉన్నా ... ప్రమాదం అని తెలిసినా లైన్‌మేన్, ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైన అధికారులుస్పందించి తెగిన విద్యుత్ తీగలు తొలగించడం, లేక అమర్చడం చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ ఆలయ వార్షికోత్సవం

పుంగనూరు, మే 14 ప్రభాతవార్త స్థానిక శ్రీరుక్మిణి సమేత శ్రీకృష్ణదేవ స్థానం మూడో వార్షికోత్సవం బుధ వారం వైభవంగా జరిగింది. కార్యనిర్వాహక అధ్యక్షులు లింగమూర్తి యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆలయం ప్రతిష్ట జరిగిన రోజున వార్షికోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు కళ్యాణోత్సవం జరిపించి అన్నదాన కార్యక్రమం, భజన జరుగుతుందన్నారు. అన్నదాన కార్యక్రమం కోసం విరాళాలు అందించిన దాతలకు ముఖ్యంగా ఆలయంలో నిత్యం జరిగే పూజా కార్యక్రమాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతినెల ఆర్థిక సహాయ, సహకారాలు అందిస్తున్న పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ఉపాధ్యక్షులు రెడ్డప్పరెడ్డి యాదవ్ మాట్లాడుతూ సమాజం సుఖశాంతుల కోసం కళ్యాణోత్సవం నిర్వహించామన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్రప్ప యాదవ్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి అభివృద్ధి కార్యక్రమాలకు సహకారాలు అందిస్తున్న స్థలదాత సుబ్రహ్మణ్యం యాదవ్, వెంకటరెడ్డి యాదవ్, వెంకట ముని యాదవ్, ఎల్ వి రమణ యాదవ్, సుబ్బన్న యాదవ్, సమీపతి యాదవులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మునిరత్నం యాదవ్, గౌరమ్మ యాదవ్, మోహన్ యాదవ్, రామకృష్ణ యాదవ్, కృష్ణమూర్తి యాదవ్, గంగరాజు యాదవ్, డివి రమణప్ప యాదవ్, నాగరాజు యాదవ్, ఆనంద్ యాదవ్, నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

సదుం, మే 14, ప్రభాతవార్త

తాము చెల్లించిన డిపాజిట్ డబ్బులు వెనక్కు ఇవ్వమని అడిగి ఆ డబ్బులు కోసం దాడి చేసిన సంఘటనపై సదుం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయినట్లు ఎస్సై షేక్షావలి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు రాయలసీమ జోన్ కిసాన్ యోజన పథకం కింద టీ వెంకటరమణా అనే వ్యక్తి డీలర్ షిప్ తీసుకున్నాడు. అతని వద్ద నుంచి సదుం మండలం బూరగ మంద పంచాయతీ దిన్నె వడ్డేపల్లికి చెందిన నాగవేణి సబ్ డీలర్గా డీలర్ షిప్ తీసుకున్నది. ఈ సందర్భంగా ఆమె సెక్యూరిటీ డిపార్ట్ కింద 5000 రూపాయలను చెల్లించింది. అదేవిధంగా 800 రూపాయల చొప్పున రైతుల వద్ద నుంచి డిపాజిట్లు సేకరించి చెల్లించింది. దాదాపు నాలుగు లక్షల వరకు ఆమె రైతుల వద్ద నుంచి వసూలు చేసి సెక్యూరిటీ డిపాజిట్ కింద వెంకటరమణకు చెల్లించింది. కానీ పనులు స్టార్ట్ కాకపోవడంతో నాగవేణి తన డబ్బులు తనకు ఇప్పించమని రైతులు అడుగుతున్నారని వెంకటరమణను భర్త రూపేంద్ర గుడ్లవారిపల్లి చెందిన లక్ష్మీనారాయణ రెడ్డి లతో కలిసి ఈనెల 5వ తేదీ పీలేరులో అడిగింది. అనంతరం అతన్ని తన స్వగ్రామమైన దిన్నే వడ్డేపల్లికు తీసుకువచ్చి ఇంటిలో బంధించి కొట్టి అతని వద్దనున్న బంగారు చైన్ను అదేవిధంగా 80 వేల రూపాయలు డబ్బును తీసుకొని పంపించింది. దీనిపై వెంకటరమణ సదుం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూ. 35 లక్షలతో రొంపిచెర్ల ఈద్గా ఫ్లోరింగ్

రొంపిచెర్ల, మే 14, ప్రభాతవార్త:

రొంపిచెర్ల ఈద్గాలో ముస్లీం సోదరులు ప్రార్థన చేసేం దుకు రూ.35 లక్షలతో ఫ్లోరింగ్ పనులను బుధవారం రొంపిచర్ల సర్పంచ్ ఇబ్రాహీం ఖాన్ ప్రారంభించారు. ముస్లీం సోదరులు రంజాన్, బక్రీద్ పండుగలకు ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు ముళ్ళ కంపలు ఉన్నాయని ఇబ్బంది పడేవారని తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామని ముస్లీం సోదరులు తెలిపారు. దీంతో ఉపాధి హామీ పథకంలో నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దీంతో ఫ్లోరింగ్ పనులు చేపట్టామని తెలిపారు. ఇంచార్జి ఏఈ ఫయాజ్, ముస్లీం మత గురువులు, ముస్లీం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

కుప్పంలో పర్యటించిన నారా బ్రాహ్మణి

- సిఎం సొంతింటి నిర్మాణాలు పరిశీలన !!

కుప్పం, మే 14 ప్రభాతవార్త కుప్పం నియోజకవర్గ ంలోని శాంతిపురం మండలం కదిరి ఓబనపల్లి వద్ద సిఎం చంద్రబాబునాయుడు సొంతింటి నిర్మాణం చేపడుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం సిఎం చంద్రబాబునాయుడు కోడలు, మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి కదిరి ఓబనపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న ఇంటి నిర్మాణ పనులు పరిశీలించినట్లు సమాచారం. ఇంటి నిర్మాణ పనులు దాదాపు పూర్తవుతున్న నేపథ్యంలో ఆమె కాంట్రాక్టర్లకు పలు సూచనలు, మార్పులు, చేర్పులను ఇంటిని పరిశీలించి చేసినట్లు తెలిసింది. అనంతరం కుప్పం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ పర్యటన పూర్తి ప్రైవేట్ కార్యక్రమంగా జరిగింది.

జిల్లా ఎస్పీచే గంగజాతర ఏర్పాట్లు పరిశీలన

కుప్పం, మే 14 ప్రభాతవార్త

కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ జాతరకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. తొలుత అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి చేరుకోగా ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, రాష్ట్ర నేత గోపీనాథ్, కమిటీ సభ్యులు ఎస్పీకి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ ఆలయ పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారిలో ట్రాఫిక్ మళ్లింపు, క్యూలైన్లు తదితర ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అగ్నిగుండం నిర్వహించే ప్రాంతం, జలధిబావి ప్రాంతాలను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఎస్పీ పార్థసారథి, అర్బన్ సిఐ శంకరయ్య, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సైలు పాల్గొన్నారు.

శ్రీ తిరుపతి గంగమ్మకు 21.31లక్షల ఆదాయం

కుప్పం, మే 14 ప్రభాతవార్త కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారికి భక్తుల కానుకల రూపంలో 21.31లక్షల ఆదాయం లభించింది. బుధవారం ఆలయ ప్రాంగణంలో మదనపల్లి డివిజన్ తనిఖీదారు శశికుమార్, ఆలయ ఇఒ కమలాకర్, ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. అమ్మవారికి 21.31లక్షల ఆదాయంతో పాటు 71గ్రాముల బంగారం, 169గ్రాముల వెండిని భక్తులు చెల్లించు కున్నారు. ఈ ఆదాయం ఏడు నెలల కాలంలో ఆలయానికి చేకూరినట్లు ఇఒ కమలాకర్ తెలిపారు. రాష్ట్ర నేతలు గోపీనాథ్, డా॥ వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

కడ సలహా కమిటీ సభ్యుడికి ఘన సత్కారం

కుప్పం, మే 14 ప్రభాతవార్త

కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) పొలిటికల్ సలహా కమిటీ సభ్యుడిగా నియమితులైన సతీష్‌కుమార్‌ను మాజీ ఎంపిపి చౌడప్ప అధ్వర్యంలో గాండ్లకులస్తులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, సిఎం పిఎ మనోహర్‌లకు గాండ్ల కులస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక గాండ్ల కులస్తులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో సారా ఊటలు ధ్వంసం

కుప్పం, మే 14 ప్రభాతవార్త జిల్లా అటవీ అధికారి భరణి ఆదేశాల మేరకు కుప్పం రేంజర్ జయశంకర్ సూచనలతో అటవీ అధికారులు సిబ్బంది నడిమూరు అటవీ బీట్ పరిధిలో విస్తృత తనిఖీలు చేశారు. ఈసందర్భంగా మోట్లచేను అటవీ ప్రాంతంలో రెండు ప్రదేశాల్లో నిర్వహిస్తున్న 500 లీటర్ల నాటుసారా ఊటలను ధ్వంసం చేశారు. ఇకపై అటవీ ప్రాంతాల్లో నిరంతరం నాటుసారాపై పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు రేంజర్ జయశంకర్ తెలిపారు.

ఉపాధిహామీపనులు పారదర్శకంగా చేపట్టాలి

కుప్పంరూరల్, మే 14 ప్రభాతవార్త మండలంలో జరుగు తున్న ఉపాధిహామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ సూచించారు. బుధవారం వసనాడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎపిఒ హరినాథ్‌తో మాట్లాడుతూ పనుల విషయంలో ఖచ్చితత్వం పాటించాలని, మస్టర్ల పరిశీలన తప్పక చేయాలని ఉపాధి పనుల్లో ఎక్కడా అవకతవకలు జరగకుండా పనులు చేపట్టాలని సూచించారు. సిఎం నియోజకవర్గంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

రేపు మంత్రి నిమ్మల రామానాయుడు కుప్పం రాక

కుప్పం, మే 14 ప్రభాతవార్త

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా॥ నిమ్మల రామానాయుడు ఈనెల 16వతేది కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తారని సమాచారం. ఆరోజు నియోజకవర్గంలో జరుగుతున్న హంద్రీ-నీవా పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారనితెలిసింది. అలాగేఅదేరోజుకుప్పంశ్రీతిరుపతి గంగమ్మ తల్లిని దర్శించుకుంటారని సమాచారం.

మహిళలు ఆర్థికంగా పైకి ఎదగాలి

రామకుప్పం, మే 14 ప్రభాతవార్త

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే సిఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని తెదేపా నేతలు మునస్వామి, పట్ట నారాయణ, ఆనందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలో ప్రభుత్వం తరపున మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా సిఎం చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు. అందుకే ప్రభుత్వం తరపున ఉచిత కుట్టు శిక్షణ ఇప్పించి అనంతరం కుట్టుమిషన్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకుని రాణించాలన్నారు. కార్యక్రమంలో నేతలు నరసింహులు, రామూర్తి, చలపతి, చిన్నికృష్ణ, వెంకటరామగౌడు, అనసూయ, రఫీ, వెంకటరమణ, మనోహర్, వెంకటాచలం, రామలింగారెడ్డి, అల్లమ్మ, పద్మమ్మ, మహిళలు పాల్గొన్నారు.

భారత సైనిక దళాలకు సంఘీభావంగా శ్రీసిటీలో రక్తదాన శిబిరం

- విశేష స్పందన

సత్యవేడు, మే 14 ప్రభాతవార్త: భారత సైనిక దళాలకు సంఘీభావంగా బుధవారం శ్రీసిటీలో నిర్వహించిన రక్తదాన శిబిరంకు విశేష స్పందన వచ్చింది. శ్రీసిటీ ఫౌండేషన్, తిరుపతి ఎన్‌టీఆర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్ వద్ద ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన శిబిరంను శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. సాయంత్రం 3.30 సాగిన శిబిరంలో టీహెచ్‌కే, ఫార్మా, రాక్‌వర్ట్, ఈ ప్యాక్, బ్రేక్స్ ఇండియా, బాంబే కోటింగ్, డైకి అల్యూమినియం, అల్సటాం, డైకిన్, కొబెల్కో, డాలీని, నోవా ఎయిర్, కింబర్లీ, క్లార్క్, స్టేషన్ ఎస్‌తో పాటు మరికొన్ని పరిశ్రమల ఉద్యోగులు శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది సహా 320 మంది రక్తదానం చేశారు. మన దేశ సమగ్రతను చాటి చెబుతూ సైనిక దళాలకు మద్దతుగా ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రసన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్, సెక్యూరిటీ హెడ్ రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, ఎన్‌టీఆర్ ట్రస్టు పీఆర్‌వో రవి తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు

యువత ఉన్నత ఆశయాలతో జీవన పరిస్థితులు మెరుగుపరచుకోవాలి

విజయపురం, మే 14 ప్రభాతవార్త: యువత ఉన్నత ఆశయాలతో తమ వ్యక్తిగత జీవన పరిస్థితులను మెరుగుపరచుకోవాలని సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ తెలిపారు. బుధవారం విజయపురం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ పూర్తయిన వెంటనే పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. పట్టుదల, క్రమశిక్షణ మంచి నడవడితో తమ కుటుంబ జీవన పరిస్థితులను మెరుగుపరచుకోవాలన్నారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు బ్యాంకులు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు ప్రలోభాలకు గురికాకుండా మంచి నడవడితో తమ కుటుంబాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మారుతున్న కాలాన్ని కనుగొనగా సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకుని మంచి పౌరులుగా దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ తోటల పెంపకంపై రైతులకు అవగాహన అవసరం

విజయపురం, మే 14 ప్రభాతవార్త:

ఆయిల్ ఫామ్ తోటలపెంపకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోసలనగరం రైతు సేవా కేంద్రంలో రైతులకు ఆయిల్ ఫామ్ తోటల పెంపకంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ తోటల పెంపకంతో రైతులకు కలిగే ఆదాయాన్ని వివరించారు. అలాగే ప్రభుత్వం నుంచి రైతులకు ఉచితంగా ఆయిల్ ఫామ్ మొక్కల పంపిణీ, వివిధ రకాల రాయితీలను గురించి తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి రజని కుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పవిత్ర, కల్పన, విజయ్, ప్రియ, విజయపురం గ్రాడ్రేజ్ సిబ్బంది కేశవులు, భీమరాయుడు, పలు రైతులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ,ప్రేరణ

తిరుపతి డివిజన్

ప్రిన్సిపల్‌కు ఉత్తమ నర్సింగ్ పరిశోధకురాలు అవార్డు

తిరుపతి విద్య, మే 14 ప్రభాతవార్త

విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రం వేదికగా మంగళవారం అంతర్జాతీయ నర్సింగ్ దివనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ నర్సింగ్ కౌన్సిల్ నర్సింగ్ లోని పలు విభాగా లలో అత్యంత ప్రతిభ కనబరచిన వారికి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను అందజేసింది. ఇందులో భాగంగా తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గంగా భవాని ఉత్తమ నర్సింగ్ పరిశోధకురాలు అవార్డును కైవసం చేసుకున్నారు. ఆగ్యోగశాఖా మంత్రి, ప్రభుత్వాధికారుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని ప్రిన్సిపల్ గంగాభవానిని వర్సిటీలో ఆమెను అభినందించి ఘనంగా సత్కరించారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

పుత్తూరు, మే 14 ప్రభాతవార్త :

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 16వ తేదీన జరగనున్న జాబ్ మేళాకు సంబంధించి బుధవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ మేళాలో 22 కంపెనీలు 800 ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎం.గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. పది, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, బిఫార్మశీ, ఎంబిఎ పాసైన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు ఎస్.రసూల్ (6300954441), కిషోర్ (6304330520) నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉద్యోగాలు పొందాలని ఎమ్మెల్యే భానుప్రకాశ్ కోరారు.

రీసర్వేను వేగవంతం చేయండి..తహశీల్దార్

తొట్టంబేడు, మే 14 ప్రభాతవార్త

రీసర్వేను వేగవంతం చేయాలని తహశీల్దార్ మధుసూధన్ సచివాలయ సర్వేయర్లను ఆదేశించారు. మండలంలో మొదటగా పైలట్ ప్రాజెక్టుగా కొన్నలి గ్రామంను ఎంచుకుని సర్వేపూర్తిచేశామని తర్వాత ఆన్‌లైన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం మండలంలోని చిన్నసింగమాల,కళ్ళిపూడి గ్రామాల్లో రీసర్వే జరుగుతున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన రెండు గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. చిన్నసింగమాల రెవెన్యూ గ్రామంలో 72.27 ఎకరాలు ఉండగా, ప్రభుత్వ భూములు 21.73 ఎకరాలు, అటవీశాఖ భూములు లేవని తహశీల్దార్ తెలిపారు. ఇక కళ్ళిపూడి రెవెన్యూలో మొత్తం 425 ఎకరాలు ఉండగా పట్టాభూములు 167.46 ఎకరాలు, ప్రభుత్వ భూములు 257.54 ఎకరాలు ఉన్నాయని తహశీల్దార్ వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రీసర్వే పనులు వేగవంతం చేయాలని సచివాలయ సర్వేయర్లకు తహశీల్దార్ సూచించారు.

శుకబ్రహ్మాశ్రమంలో శ్రీగంధం చెట్టు నరికివేత

శ్రీకాళహస్తి, మే 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిపుణ్యక్షేత్రంలో మరో ఆధ్యాత్మిక క్షేత్రం వెలసి ఉంది అదే శ్రీశుకబ్రహ్మాశ్రమం. ఇక్కడి ప్రాంతంలో ధ్యానమందిరంతో పాటు నాగమల్లిచెట్లు ఆకట్టుకోవడంతో పాటు ఆశ్రమ పీఠాధిపతి శ్రీవిద్యాప్రకాశనందగిరి స్వాముల వారి ధాన్యమందిరం, అందులో ఆయన పాలరాతి విగ్రహాలు కనిపిస్తాయి. ఇక్కడ మొక్కలు పెంచడం ఆనవాయితీ. అయితే ఆశ్రమ ఆవరణలో ఉన్న శ్రీగంధం చెట్టును కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రంపంతో కోసుకుని వెళ్ళిపోయారు. దీంతో విషయం తెలుసుకున్న ఆశ్రమ పీఠాధిపతి దీన్ని పరిశీలించి ఇకపై ఇలాంటివి జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆశ్రమంలో పనిచేస్తున్న సిబ్బందిని ఆదేశించారు. అధ్యాత్మిక వాతావరణంలో ఉండే శుకబ్రహ్మాశ్రమంలో ఇలాంటి పనులు పునరావృత్తం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారిగా హర్షవర్ధన్

సత్యవేడు, మే 14 ప్రభాతవార్త:

సత్యవేడు మండలం దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా హర్షవర్ధన్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ వైద్యులుగా పని చేస్తున్న గుణశేఖర్, మురళీకృష్ణ ఉన్నత చదువుల కోసం వెళ్ళడంతో వైద్యుల పోస్టు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వైద్యుల నియామకాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారిగా హర్షవర్ధన్ నియమితులయ్యారు. ఈ క్రమంలోఆయన బాధ్యతలు స్వీకరించడం జరిగింది. దీంతో పాటు ఇన్‌చార్జి వైద్యులుగా పని చేస్తున్న అరుణ్ కిషోర్ కూడా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్య లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తామన్నారు.

10 విభాగాలను పరిశీలించిన వీసీఐ బృందం

తిరుపతి విద్య మే 14 ప్రభాత వార్త

ఎస్వీ వెటర్నరీ కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం బుధవారం పర్యటించింది. ఇందులో భాగంగా కళాశాలలోని సుమారు 10 విభాగాలను పరిశీలించి మౌళిక సదుపాయాలపై ఆరా తీశారు. ప్రధానంగా అధ్యాపకులు వివరాలు, తరగతి గదులు, పాఠ్యాంశాల బోధన ప్రక్రియతో పాటు విభాగాలలో పనితీరుపై దృష్టి సారించి అధికారులను అడిగి వివరాలు సేకరించారు. గురువారం క్లీనిక్స్, సర్జరీ, గైనకాలజీ, మెడిసన్, స్టేట్ లెవల్ ల్యాబ్, విద్యార్థులు వసతిగృహాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలించనున్నారు.

అమ్మవారి ఆలయ నూతన డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్

తిరుచానూరు, మే 14, ప్రభాతవార్త

పద్మావతి అమ్మవారి ఆలయానికి నూతన డిప్యూటీ ఈఓ హరేంద్రనాథ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన తిరుమల రిసెప్షన్ ఆర్ 2 నందు బాధ్యతలు నిర్వహించి బదిలీ అయి తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ డిప్యూటీ ఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మొదటగా సామాన్య భక్తులు శీఘ్రంగా అమ్మవారిని దర్శించుకోవడమే ప్రధాన లక్ష్యం అని అన్నారు. అమ్మవారి ఆలయ సిబ్బంది భక్తులపట్ల మర్యాదగా, ప్రేమ భావంతో సేవ చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి గ్రామ స్థానికులు సహకరించాలని కోరారు. ఇది ఇలా ఉండగా గతంలో విధులు నిర్వహించిన గోవింద రాజన్‌ను తిరుమల ఈఓ ఆదేశాల మేరకు హెచ్‌ఆర్ డిప్యూటీ ఈవోగా, తిరుపతి ఆలయాల పర్యవేక్షణ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

నీటి సరఫరా జరిగినపుడే ఉపయోగించుకోవాలి:

శ్రీకాళహస్తి,మే 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో మున్సిపాలిటి సరఫరా చేస్తున్న నీటిని ఎప్పుడు సరఫరా జరిగితే అప్పుడు పట్టుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.యస్.గిరికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం కావటంతో విద్యుత్ సరపరాకు సంబంధించి కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. దాంతో తెలుగుగంట నుంచి పంపింగ్ అలాగే రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేయటానికి విద్యుత్ సరఫరాలో అంతరాయంతో మున్సిపల్ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. వారం రోజులుగా వాతావరణంలో మార్పు వర్షాలు, గాలి వాన ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. లో వోల్టేజ్ సమస్యను కూడా ఎదుర్కొంటున్నట్లు వివరించారు. కాబట్టి నీటి సరఫరాలో సమయపాలన సాధ్యం కాదని వివరించారు. రిజర్వాయర్లలో నీరు నిండిన వెంటనే విడుదల చేస్తున్నామని ప్రజలుసహకరించాలని కమిషనర్ కోరారు.

శివయ్య సేవలో ప్రభుత్వ విప్

శ్రీకాళహస్తి,మే 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో అతిథుల తాకిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో తాడేపల్లిగూడేం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొల్లిశెట్టి శ్రీనివాస్ కుటుంబసభ్యులతో దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో అధికారులు, ఓ వైపు బిజెపి, మరో వైపు జనసేన నాయకులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల సన్నిధిలో అంతరాలయం దర్శనం ఏర్పాటు చేసారు. ఆలయ ఎఇఓ సతీష్‌మాలిక్ సారధ్యంలో పిఆర్‌ఓ రవి ఏర్పాట్లు పర్యవేక్షించగా మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. కాగా ఆలయంలో బిజెపికి చెందిన నాయకకులు కటికం చందు, సజ్జ హరిష్, సారధ్యంలో స్వాగతం ఏర్పాటు చేసారు. కాగా జనసేన నాయకులు శివకుమార్, పేట చంద్రశేఖర్, రవికుమార్‌రెడ్డి, పేట చిరంజీవి,వీర మహిళలు వేరుగా స్వాగతం పలికి సత్కరించారు.

చెవిరెడ్డి తప్పిపుచ్చుకోవటానికే ఈశ్వరరెడ్డిపై అవాస్తవ ఆరోపణలు

– పెరుమాళ్ళపల్లి పంచాయతీ తెలుగు మహిళలు

తిరుపతిరూరల్, మే 14 ప్రభాతవార్త:

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుడ నిధులను దుర్వినియోగం చేసారని....చేసిన తప్పి పుచ్చుకోవటానికే, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డిపై అవాస్తవ ఆరోపణలు చేయిస్తున్నారని పెరుమాళ్ళపల్లి తెలుగు మహిళలు కుసుమ, పుష్ప, దుర్గలు తెలిపారు. తుడా నిధులతో తుమ్మలగుంట చెరువును పార్కు చేశారని, ఎవరి లబ్ది కోసం చేశారో చెప్పాలని, చెరువును యధావిధిగా ఉంచి ఉంటే గతంలో వరదల వచ్చిన సమయంలో మహిళ యూనివర్శిటీ, ఎంఆర్ పల్లి శ్రీకృష్ణనగర్‌లలో మునక వచ్చేదా అని ప్రశ్నించారు. బుధవారం పెరుమాళ్ళపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహిళలు మాట్లాడుతూ ఈశ్వరరెడ్డి ఎక్కడైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఉంటే, పెరుమాళ్ళపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద సత్యప్రమాణానికి సిద్ధమని, వైకాపా నాయకులు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈశ్వరరెడ్డిపై నిరాధార, అవాస్తవ ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవి, ప్రమీల, కళ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట బీసీ హాస్టల్‌లో విద్యా మణిదీపం..

రేణిగుంట, మే14 ప్రభాతవార్త రేణిగుంట బీసీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక బాలుర ప్లస్ టు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి పరీక్ష ఫలితాల్లో 600కు 559 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన నిరుపేద విద్యార్థి కే. వెంకటేష్ ను అందరూ అభినందిస్తున్నారు. వెంకటేష్ రేణిగుంట బీసీ సంక్షేమ హాస్టల్ లో వసతి పొందుతూ అటు ఆటల్లోనూ ఇటు చదువులోనూ ముందంజలో ఉండేవాడని బీసీ వసతి గృహ సంక్షేమ అధికారి పల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. గత నెల లో విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ హాస్టల్లో ఉంటూ విద్యను అభ్యసించే విద్యార్థుల్లో జిల్లా స్థాయి నందు ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులయ్యాడు. విద్యార్థి ప్రతిభను గుర్తించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అతనికి జ్ఞాపిక తో పాటు ప్రశంసా పత్రాన్ని ఇచ్చి అభినందించారు. జిల్లాస్థాయిలో రాణించిన ప్రభుత్వ హాస్టల్ విద్యార్థిగా వెంకటేష్ , అతని తల్లిదండ్రులకు గురువారం విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రభుత్వం తరఫున మెమెంటుతోపాటు ధ్రువీకరణ పత్రాన్ని అందజేయనున్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి మంచి విద్య అందించడానికి కృషి చేస్తున్న బీసీ హాస్టల్ వార్డెన్ చల్లా వెంకటేశ్వర్లు, మంచి ర్యాంకు సాధించిన వెంకటేష్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, బీసీ సంక్షేమ సాధికారత అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి, సహాయ బిసి సంక్షేమ అధికారి జ్యోత్స్న, రేణిగుంట ప్రముఖులు, రేణిగుంట బాలుర ప్లస్ టు ఉన్నత పాఠశాల ప్రధానాచార్యులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

తుడా చైర్మన్‌కు ఘన సత్కారం

రేణిగుంట, మే 14 ప్రభాతవార్త

తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని రేణిగుంట పట్టణ టిడిపి యువనేత, వార్డ్ మెంబర్ ఎంజి రెడ్డి బుధవారం ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం డాలర్స్ దివాకర్ రెడ్డిని తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీస్ చైర్మన్ గా ప్రకటించిన అనంతరం ఎంజిరెడ్డి , ఆయన మిత్ర బృందందివాకర్‌రెడ్డికిపూల బొకే ఇచ్చి సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. డాలర్స్ దివాకర్ రెడ్డిని తుడా చైర్మన్ పదవి అలంకరించడం వల్ల టిడిపి పార్టీకి బలం చేకూరిందని ఎంజిరెడ్డి అన్నారు. ఆయన భవిష్యత్తులో ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించి ప్రజా సేవ చేయాలని ఆకాంక్షించారు. దివాకర్ రెడ్డిని సత్కరించిన వారిలో రేణిగుంట మండల యూత్ నేతలు బుల్లెట్ రాజా, సోమశేఖర్ రెడ్డి, పునీత్, ప్రశాంత్, బాలాజీ పాల్గొన్నారు.

ఎస్‌నైకర్ హోమ్ సర్వీస్‌కు వినియోగదారుల నుంచి విశేష స్పందన

తిరుపతి హెల్త్, మే 14 ప్రభాతవార్త ః

తిరుపతిలో గత మూడు రోజుల క్రితం ప్రారంభించిన ఎస్‌నైకర్ హోమ్ సర్వీస్‌కు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించినట్లు ఎస్‌నైకర్ హోమ్ సర్వీస్ యాప్ వ్యవస్థాపకులు కృష్ణ చైతన్య అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. యాప్ ద్వారా బుక్ చేసుకున్న వినియోగ దారులకు క్షణాల్లో ఇంటిలోని టాయ్‌లెంట్స్, ఏసీలు, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, అన్ని రకాల రిపేర్లు తన సిబ్బంది ద్వారా చేయడం జరుగుతుందన్నారు. ఈ యాప్‌ను ప్రారంభించిన రోజు నుంచే వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నట్లు తెలిపారు. గూగుల్ ప్లే ద్వారా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. ఎస్ఎన్ఐసికేఆర్.కామ్‌ను యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. వివరాలకు 7799466684ను సంప్రదించవచ్చునన్నారు.

ఈశ్వర్‌రెడ్డి కబ్జా చేసిన ఎ.3.61 సెంట్ల ప్రభుత్వ భూమిని

తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తాడా...? – వైఎస్ఆర్‌సీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డికి సూటి ప్రశ్న

తిరుపతి హెల్త్, మే 14 ప్రభాతవార్త ః చంద్రగిరి నియోజక వర్గం టీడీపీ నేత ఈశ్వర్‌రెడ్డి కబ్జా చేసిన ఎ.3.61 సెంట్ల భూమిని ప్రభుత్వానికి తిరిగి అప్పగిస్తాడా...? అదే తరహాలో తుడా నిధులతో అభివృద్ధి చేసిన తుమ్మలగుంట కేవీఎస్ పార్కు తుడాకు ఇచ్చేస్తామని వైఎస్ఆర్‌సీపీ నేత మునీశ్వర్‌రెడ్డి ఈశ్వర్‌రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ నేతలతో కలిసి మాట్లాడారు. తుడా నిధులతో పార్టీలకు అతీతంగా తుడా పరిధిలోని శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి, చంద్రగిరి నియోజక వర్గాల్లోని మున్సిపాలిటీ, గ్రామ పంచాయితీ, పట్టణాల్లో కోట్లాది రూపాయలతో పార్కులు, మహిళా భవనాలు, సమావేశ మందిరాలు, యోగా ధ్యాన మందిరాలు, కర్మ క్రియ భవనాలు వందల సంఖ్యలో కట్టించడం జరిగిందన్నారు. వాటన్నింటిని నేడు అధికారంలోకి వచ్చిన కూటమి, ప్రధానంగా టీడీపీ నేత ఈశ్వర్‌రెడ్డి తుడా స్వాధీనం చేసుకునే విధంగా సహకరిస్తారా అని విమర్శించారు. దీనిలో భాగంగానే తుమ్మలగుంటలోని కేవీఎస్ పార్కు అని, ఈ పార్కు అభివృద్ధి చేసి తుమ్మల గుంట పంచాయితీకి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ పార్కును తుడా స్వాధీనం చేసుకుంటుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తాను తిరుపతి రూరల్ మండలం, పుదిపట్ల గ్రామ పంచాయితీ లెక్క దాఖల్లోని సర్వే నెంబర్లు 446/ఎ 1.87 సెంట్లు, 442/1 లో 0.54 సెంట్లు,442/3లో 0.58 సెంట్లు 442/6లో 0.62 సెంట్లు మొత్తం 3.61 సెంట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని, ఈ ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. మరో పర్యాయం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి సంబంధం లేని విషయాలపై ఈశ్వర్‌రెడ్డి ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటి పట్టాలు పంపిణీ : ఎమ్మెల్యే

కేవీబీ పురం, మే 14 ప్రభాతవార్త: తమ ప్రభుత్వ హయాంలో ఇల్లు లేని ప్రతి ఒక్క కుటుంబానికి ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే ఆదిమూలం స్పష్టం చేశారు. బుధవారం కేవీబీ పురంలో 170 మంది అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఇంటి పట్టాలు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ మునిరత్నం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో అర్హులైన ప్రతిఒక్కరికి ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు వారందరికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అలాగే అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి పెన్షన్, ఇంటి పట్టాలు, పక్కా ఇల్లు వంటి ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న ఇలాంటిసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే సూచించారు.

కార్యక్రమంలో తహసీల్దార్ మునిరత్నం, ఎంపీడీవో మాలతి, పీవోపీఆర్‌డీ ప్రవళిక, జయరాంరెడ్డి, మనీ, బాలాజీ, రమేష్, కేశవ నాయుడు, చంద్రబాబు, చంద్ర నాయుడు, చెంగారెడ్డి, పరందామిరెడ్డి, శివరావు, అవసరం సురేష్‌రెడ్డి, ఆరె కరుణాకర్, సుబ్రహ్మణ్యం, వీఆర్‌వో ముని భాస్కర్, వీఆర్‌వోలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం, బీజేపీ మునిశేఖర్, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో వ్యక్తి దారుణ హత్య?

ఆలయ సమీపంలో రోజుకొక శవం

శ్రీకాళహస్తి,మే 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురైనట్లు అర్బన్‌సిఐ డి.గోపి తెలిపారు. బుధవారం సుమారు 40-45 వయస్సు గల వ్యక్తి మృతదేహం ఉన్నట్లు అందిన సమాచారంమేరకు అక్కడకు వెళ్ళి పరిశీలించగా ఆతని శరీరంపై రక్త గాయాలున్నట్లు గుర్తించినట్లు వివరించారు. తమకు అందిన సమాచారం మేరకు ఉదయం 11 గంటల సమయంలో వెళ్ళగా ఓ శ్మశానం వద్ద 40'45 సంవత్సరాల వయస్సు గల్గిన వ్యక్తి శవాన్ని గుర్తించామన్నారు. చుట్టుపక్కల విచారించగా ఎవ్వరు గుర్తించలేదన్నారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. బ్లూషర్టు, జీన్స్‌ప్యాంట్‌ధరించి ఉన్నట్లు వివరించారు. బాగా గడ్డం పెరిగి ఉందని వివరించారు. ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించడం కోసం సర్వే

నారాయణవనం, మే 14 ప్రభాతవార్త :

మండలంలోని దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించడం కోసం సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని నారాయణవనం, తిరువట్యం పంచాయతీలో భవిత కేంద్రంలోని సహిత విద్య ఉపాధ్యాయులు సర్వే చేశారు. మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ ఉత్తర మాడ వీధికి చెందిన పవిత్ర, తిరువట్యం పంచాయతీ ఎస్టీకాలనీకి చెందిన గోపిలను గుర్తించారు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్య సమన్వయకర్త డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సర్వే జరిగింది. ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించిన తర్వాత వారి తల్లితండ్రులకు ప్రభుత్వం వీరికి కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు, సౌకర్యాలతో పాటు ఉచిత ట్యాబ్‌లు, ఉపకరణాలు, కిట్లు, తల్లికివందనం, కొన్ని రకాల మినహాయింపులు, ఉచిత శస్త్ర చికిత్సలు అందిస్తున్నట్టు చెప్పారు. కావున బడి ఈడు ప్రత్యేక అవసరాల గల పిల్లలు బడిలోనే వుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజన్, భరత్, తల్లితండ్రులు పాల్గొన్నారు.

నిమజ్జనంతో వేడుకగా ముగిసిన జాతర సంబరాలు

నారాయణవనం, మే 14 ప్రభాతవార్త :

మండలంలోని బ్రాహ్మణాతాంగేల్, ఇప్పతాంగేల్, డికెపాలెం, ఎరికంబట్టు, తిరువట్యం గ్రామాల్లో బుధవారం గంగమ్మ జాతర వేడుకలు నిమజ్జనంతో ఘనంగా ముగిసింది. గత మంగళవారం జాతర వేడుకలకు సంబందించి చాటింపు చేశారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అంబళ్లు పోసి మొక్కుతీర్చుకున్నారు. రాత్రి అమ్మవారి గ్రామవీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. మొక్కుబడి కలిగిన భక్తులు మేకలను, బర్రెలను బలి ఇచ్చి మొక్కు తీర్చుకున్నారు. జాతరలో భాగంగా రెండవ రోజు అయిన బుధవారం రాత్రి నిమజ్జనానికి అమ్మవారిని మేళతాళాల మధ్య తీసుకెళ్లారు. మొక్కుబడి కలిగిన యువత వేషాలు వేసుకొని మొకు ్కను తీర్చుకున్నారు.

కైలాసకోనలో పర్యాటకుల వేసవి సందడి

నారాయణవనం, మే 14 ప్రభాతవార్త :

ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మాత్మిక, కేంద్రంగా బాసిల్లుతున్న కైలాసనాధకోనలో బుధవారం వేసవి తాపం తీర్చుకోవడం కోసం ఇటు భక్తులు, అటు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. కోన జలపాతంలో వేసవితాపం తీర్చుకోవడంతో పాటు, పవిత్రస్నానాల వల్ల పుణ్యం లభిస్తుందని భావించిన భక్తులు ఉదయం 4గ ంటల నుంచే కైలాసనాధకోనలోని జలపాత ంలో పవిత్రస్నానాన్ని చేయడానికి పోటీపడ్డారు. పవిత్రస్నానాన్ని ఆచరించిన తర్వాత అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. మహిళాభక్తులు ఆలయంలో నెయ్యిదీపాలను వెలిగించారు. అయితే 44 డిగ్రీల ఎండతో కోన జలపాతంలో స్నానం చేసి ఉపసమనం పొందారు. అలాగే పల్లెలోని బావుల వద్ద యువకులు ఈత కొడుతూ సేద తీర్చుకున్నారు.

పద్మావతి యూనివర్సిటీలో 21 అడుగుల రోడ్డు నిర్మణం

తిరుపతి(రవాణ),మే 14ప్రభాతవార్త

తిరుపతి పద్మావతి మహిల యూనివర్సిటీలో 21అడుగులరోడ్డు నిర్మాణం పనులు మొదలయ్యాయి. తుడ ద్వారా సుమారు 38లక్షలు రూపాయలు వ్యయంతో 21అడుగుల పొడవుతో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ నుండి హ్యూమానిటీస్ బ్లాక్ 2వరకు నిర్మించబడుతుందని చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ రోడ్డు విస్తరణ పనులను యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ ప

ఆదాని ఫౌండేషన్‌చే శరవేగంగా గ్రామాల అభివృద్ధి

చిల్లకూరు, మే 14 ప్రభాతవార్త : మండలం తీర ప్రాంతమైనటు వంటి తమ్మినపట్నం పంచాయతీలో ఆధాని ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. ఇందుకు ముఖ్య కారకులు అధాని ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజాన్, వారి సహచర సిబ్బందికి తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కోట సతీష్ యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. గుమ్మలదిబ్బ పాతూరు కొత్తూరు, తమ్మినపట్నం హరిజనవాడ, ఎస్టి కాలనీ ఈ ఐదు గ్రామాలు కలిపి సుమారు 150 సోలార్ లైట్లు ఏర్పాటు చేసారు. ఇదే కాకుండా క్రీడాలకు సంబంధించి యువతను ఎంతగానో ప్రోత్సహిస్తూ సుమారు అన్ని గ్రామాలకు గాను ఐదు క్రికెట్ కిట్లు మరియు కబడ్డీ మ్యాట్ ఇస్తున్నారు. అంతే కాకుండా పిల్లలకు ఉత్తమ విద్యను కూడా కల్పిస్తున్నారు. అలాగే తమినపట్నం రెవెన్యూలో గల రైతులకు వ్యవసాయ పరికరాలు సబ్సిడీలో ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. అదానీ ఫౌండేషన్ రాజేష్ రంజన్‌కు, టీంకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటూ వారు మరిన్ని సేవా కార్యక్రమాలు గ్రామాలలో విస్తృతంగా తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుం టున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సీనియర్ నాయకులు రామయ్య, తిరుపతి పార్లమెంట్ మత్స్య సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి మేకల వెంకయ్య, గ్రామ తెలుగు యువత నాయకులు నాగూరు, సుబ్బయ్య, మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలు తనిఖీ చేసిన డిఎస్పీ

కోట, మే 14 ప్రభాతవార్త : మండలం విద్యానగర్, వెంకన్నపాలెం గ్రామాల్లో ఉన్న టపాసుల దుకాణాలను బుధవారం గూడూరు డిఎస్పీ గీతాకుమారి తనిఖీలు చేశారు. నిబంధనల ప్రకారం అన్నీ ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం పలు సూచన లిచ్చారు. ఆమె వెంట సిఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

కారు బోల్తా నలుగురికి గాయాలు

పెళ్లకూరు, మే 14 ప్రభాతవార్త : పూతలపట్టు నాయుడుపేట 71 వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం అక్క గారి పేట సమీపంలో తిరుపతి నుండి తాడేపల్లి వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 1033 అంబులెన్స్ క్షతగ్రాత్రులను చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది ఎల్ రామాంజనేయులు(55) కె. శ్రీనివాసులు (55) ఎన్ గణపతి(43) వై ప్రసాదు(45) ఉన్నారు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గూడూరు, మే 14 ప్రభాతవార్త : యమహా షోరూం ఎదురుగా ఉన్న గూడూరు చెరువు అంచులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గూడూరు పోలీసులు వివరాల మేరకు ఇలా ఉన్నాయి. మృతి చెందిన వ్యక్తి సుమారు 55-60 సంవత్సరాలు ఉండవచ్చునని తెలిపారు. మృతుడు వివరాలు తెలిసిన వారు 9440796344 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. సంఘటనా స్థలానికి డిఎస్పి గీత కుమారి, రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్‌లు చేరుకుని మృతదేహాన్ని గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో మార్చురీలో ఉంచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన వ్యక్తి కెవి ప్రసాద్

-ఎంపీపీ,వైస్ ఎంపీపీ,అధికారుల ఘన సన్మానం

చిట్టమూరు, మే 14 ప్రభాతవార్త: ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన వ్యక్తి చిట్టమూరు ఎంఈఓ 2 కరణం వెంకటేశ్వర ప్రసాద్ అని పలువురు కొనియా డారు. బుధవారం చిట్టమూరు మండల కార్యాలయాల సముదాయంలోని శ్రీ శక్తి భవనంలో ఎంపీపీ సన్నారెడ్డి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు బద్దిగ వెంకట రమణయ్య, అధికారులు కేవీ ప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందించి, ఘనంగా సన్మానించి, సత్కరించారు. పనిచేసిన ప్రతి పాఠశాలలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన కృషి ప్రశంశనీయమంటూ అభినందనలతో ముంచెత్తారు. అనంతరం వైయస్సార్సీపీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి,ఎమ్మార్వో కాయల సతీష్ కుమార్,ఎంపీడీవో మనోహర్ గౌడ్,అన్ని శాఖల అధికారులు పూలమాలలు, శాలువాలతో కెవి ప్రసాద్ ను సన్మానించి,సత్కరించి ఆయనతో ఉన్న అనుబంధాన్ని గూర్చి వివరించారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ విజయలక్ష్మి

చిట్టమూరు, మే 14 ప్రభాతవార్త: అధికారులు బాధ్యతా యుతంగా పనిచేస్తూ సర్వసభ్య సమావేశంలో సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను శ్రద్ధతో పరిష్కరించి క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనిచేయాలని చిట్టమూరు ఎంపీపీ సన్నారెడ్డి విజయలక్ష్మి అన్నారు.బుధవారం స్త్రీశక్తి భవనంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధికారులు శాఖల వారీగా నివేదికలను చదివి వినిపించారు. అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని ఎంపీపీ విజయలక్ష్మి కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చిప్పల వెంకటయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బద్దిగ వెంకట రమణయ్య, రాయపు సుబ్బమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు,పిఆర్ ఏఈ జగదీష్,ఏపిఎం గున్నయ్య,ఏపీఓ షీల,హౌసింగ్ ఏఈ సుధీర్,అన్ని శాఖల అధికారులు,వీఆర్వోలు,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పలువురు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

నాయుడుపేట, మే 14 ప్రభాతవార్త : మండలంలోని శ్రీనివాసపురం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గూడూరుకు చెందిన రవితేజ, మనోజ్‌కుమార్‌లు మోటార్‌సైకిల్‌పై సూళ్ళూరుపేటకు వెళ్ళి పనులు పూర్తిచేసుకొని తిరిగి గూడూరుకు వస్తుండగా మార్గమధ్యలో నాయుడుపేట మండలం శ్రీనివాస పురం వద్దకు వచ్చేసరికి ముందుగా వెళుతున్న లారీని క్రాస్ చేయబోయి ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న రవితేజ, మనోజ్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాయుడుపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా చెన్నకేశవుని రథోత్సవం

శ్రీకాళహస్తిరూరల్, మే 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాల యానికి అనుబంధంగా ఊరందూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. స్వామివారికి సర్వాంగ సుందరంగా అలంకరించి రథంలో అధిష్ఠించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమ ంలో చిన్న ఆలయాల ఇన్‌ఛార్జి లక్ష్మయ్య ఆలయ అర్చకులు, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురు సంక్రమణ పూజలు

శ్రీకాళహస్తి,మే 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరా లయంలో గురు సంక్రమణ సందర్భంగా గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తి శ్రద్ధలతో పూజలు, వైదిక కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. గురుదక్షిణామూర్తి ఆలయం ఎదురుగా గణపతి పూజల,కలశ స్థాపన, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా హోమాలు నిర్వహించారు.ఆలయ పౌరోహితులు అర్థగిరి స్వామి సారధ్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తరువాత ధూపదీప నైవేద్యాలను నిర్వహిం చారు.

నేడు దక్షిణామూర్తికి విశేషాభిషేకాలు:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికివిశేష పూజలు నిర్వహించుటకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం నుంచి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద గురువు రాశిమారుతున్న సమయంలో విశేష పూజలు, అభిషేకాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.నవగ్రహాల్లో గురు గ్రహం వృషభరాశి నుంచి మిథున రాశిలోకి ప్రవేశించు శుభసందర్భంగా గురుదక్షిణా మూర్తికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించబడుతుందని స్వామిని గ్రామోత్సవం నిర్వహించబడుతుందని తెలిపారు. ఇక్కడ అభిషేక టిక్కెట్లు ఒక్కొక్కరికి రూ.300లని వివరించారు.

గూడూరు డివిజన్

టిడ్కో గృహాల్లో కలవరపెడుతున్న వరుస ఆత్మహత్యలు!

గూడూరు, మే 14, ప్రభాతవార్త : ఈ నెల 13న విద్యుత్ శాఖ ఉద్యోగి కావలి సుబ్బారావు (43) ఉరి వేసుకుని మృతి, బుధవారం గుణపాటి హేమలత (27) అనే మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గూడూరు రూరల్ పరిధిలోని టిడ్కో గృహాల్లో గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్ సమీపంలో ఉన్న టిడ్కో గృహాల్లో నిన్న విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కావలి సుబ్బారావు అనే వ్యక్తి వ్యసనాలకు బానిసై కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరివేసుకొని మరణించగా, నేడు గుణపాటి హేమలత అనే మహిళ రషీద్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తూ గొడవల కారణంగా చీరతో ఉరి వేసుకుని మరణించినట్లు రూరల్ పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖేలో ఇండియాలో ప్రతిభ చాటిన టెన్నిస్ దిగ్గజం

గూడూరు, మే 14 ప్రభాతవార్త: రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ టెన్నిస్ దిగ్గజం లక్ష్మి సిరి దండు బుధవారం పాట్నాలో జరిగిన ఖేలో ఇండియా టోర్నమెంట్లో పాల్గొని ప్రతిభ చాటింది.టెన్నిస్ క్రీడలో సింగిల్స్ విభాగంలో పాల్గొని కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. టెన్నిస్ క్రీడలో డబుల్స్ విభాగంలో పాల్గొని రజత పతకాన్ని సాధించింది. ఇప్పటికే జాతీయ టెన్నిస్ క్రీడల్లో రాణిస్తూ గూడూరు ఖ్యాతిని దేశమంతా వినిపిస్తోంది.

రోటరీ వెస్ట్ క్లబ్‌చే పేషెంట్ బెడ్స్ బహుకరణ

చిల్లకూరు, మే 13 ప్రభాతవార్త : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రొటేరియన్ పీవీ సుధాకర్ రావు, బండి ధనంజయ రెడ్డిల దాతృత్వంతో రెండు పేషెంట్ పడకలను బుధవారం అందించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ అరాఫత్ మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ వారు మా హాస్పిటల్‌కి అవసరమైన రెండు పడకలను అందించటం అభినందనీయమని, అందుకు సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నాశన నాగులు, సెక్రెటరీ చోళవరం గిరిబాబు, సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పిఎం రావు, సనత్ కుమార్‌రెడ్డి, సిద్ధారెడ్డి, డా.తేజస్విని, ఉమాపతి, రవికుమార్, బలరామిరెడ్డి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

లిటిల్ ఏంజెల్స్ విద్యార్థుల ప్రతిభ

గూడూరు, మే 14 ప్రభాతవార్త : 2024-25 సి.బి.ఎస్.సి 10వ తరగతి ఫలితాల్లో చిల్లకూరు శారద నగర్లో ఏర్పాటై ఉన్న లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ ప్రతిభ చాటారు. 500 మార్కులకు 474 మార్కులతో పి. ఆధ్యా, పి. వెంకట శరణ్ లు స్కూల్ టాపర్స్‌గా నిలిచారు. పరీక్షలకు హాజరైన 77 మంది విద్యార్థులలో 51 మంది 80 మార్కులు సాధించగా, పరీక్ష రాసిన అందరూ విద్యార్థులు ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత సాధించడం పాఠశాలకు విద్యార్థుల పట్ల ఉన్న అంకితభావాన్ని తెలియజేస్తుంది. ఉపాధ్యాయులకు పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సుధేష్ణ, ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్‌రెడ్డిలు అభినందనలు తెలియజేశారు.

రథంపై కొలువుదీరిన శ్రీ చెన్నకేశవ స్వామి

గూడూరు, మే 14 ప్రభాతవార్త : శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో బుధవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలుగా తుపిలి సురేంద్ర పద్మజలు కుమారుడు కళ్యాణ్ చక్రవర్తి దివ్యలు, సోనికా, దాన్విత్. అల్లుడు జలదంకి విజయ్ అలేఖ్యలు, హనీవిత జయంష్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. గోవింద నామస్మరణతో భక్తులు రథం లాగి ముక్కులు తీర్చుకున్నారు. మండుట ఎండని లెక్కచేయకుండా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి : డిఎల్‌పిఓ

కోట, మే 14 ప్రభాతవార్త : గూడూరు డివిజన్‌లోని 184 స్వర్ణ పంచాయతీల్లో నూరుశాతం పంచాయతీ కార్యదర్శులు పన్నులు వసూలు చేయాలని డిఎల్‌పిఓ వెంకటరమణ కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీల్లో ఆధార్ అప్‌డేట్, దత్తత గ్రామ పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ల పనితీరు, ఐవిఆర్ గ్రామ పంచాయతీల్లో తక్షణమే చేపట్టాల్సిన పనులు గురించి వివరించారు. బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ విషయంలో జిఓ నంబర్ 3, 4 అమలుపై వివరించారు. వేసవి కాలంలో మంచినీటి సమస్య రాకుండా తక్షణమే తీసుకోవాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ రవి, ఎంపిడిఓ దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

ఓజిలి, మే 14 ప్రభాతవార్త : మండలంలోని చిల్లమాను చేను గ్రామంలో బాల్య వివాహా లపై సబ్ ఇన్స్పెక్టర్ స్వప్న, సిబ్బంది అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఓజిలి ఎస్సై స్వప్న మాట్లాడు తూ చిన్నతనంలోనే బాల్య వివాహాలు చేసుకోవ డం వలన ఎన్నో ఆరోగ్య సమస్య లకు ఎన్నో ఆర్థిక సమస్యలకు గురవుతారని కొన్ని ఉదాహరణలతో ప్రజలకు తెలియజేశారు. బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని వాటిని ప్రోత్సహించే వారి మీద కూడా కఠిన చర్యలు ఉంటాయని తెలియజేశారు. బాల్యవివాహాలకు ఎవరైనా పాల్పడితే తమకు తెలియజేయాలని ప్రజలను ఓజిలి ఎస్సై స్వప్న కోరారు. అతిగా తాగి డ్రైవింగ్ చేసి ఆక్సిడెంట్‌లో ప్రాణాలు ఎంతో మంది కోల్పోయి వాళ్ళ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. బైక్ నడిపే సమయంలో హెల్మెంట్ తప్పనిసరిగా వాడాలని తెలియ చేశారు.

సిబిఎస్ పదో తరగతిలో టాపర్‌గా ఆధ్యారెడ్డి

వాకాడు, మే 14 ప్రభాతవార్త : 2025 సంవత్సరంలో గూడూరు డివిజన్లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో పదవ తరగతిలో చదివిన ఆధ్యారెడ్డి ప్రథమ స్థానంలో నిలిచినది. పాఠశాల యాజమాన్యం వివరాలు మేరకు వాకాడు గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి కుమార్తె ఆధ్యారెడ్డి చిల్లకూరు గ్రామంలోని ఉన్న లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో సిబిఎస్ పదవ తరగతి 500 మార్కులు గాను 474 మార్కులు సాధించి డివిజన్ లోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

కోటలో 62 మంది గురువులకు స్థానచలనం

కోట, మే 14 ప్రభాతవార్త : ఉపాధ్యాయుల బదిలీలకు తెరలేచింది. దాదాపు రెండేళ్ల తర్వాత ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆ మేరకు కోట మండలంలో ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న 62 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలగనుంది. ఉపాధ్యాయ కొలువులు, హేతుబద్ధీకరణ, బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేయనున్నారు. బదిలీల చట్టప్రకారం తొలిసారిగా ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు. విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఒకేచోట ఎనిమిదేళ్ల పాటు పనిచేసిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. ఆ మేరకు కోట మండలంలో 62 మంది ఉపాధ్యాయులు బదిలీ కానున్నట్లు ఎంఇఓ మస్తానయ్య చెప్పారు.

పంట సాగుకు వ్యవసాయశాఖ ప్రణాళిక

కోట, మే 14 ప్రభాతవార్త : రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేయబోయే పలు రకాల పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. అందుకు కావలసిన విత్తనాలు, ఎరువులు ఎంత మేరకు అవసరమో అధికారులు గణాంకాలు తయారు చేశారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతుసేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ప్రైవేటు డీలర్లు వద్ద ఉండేలా చర్యలు చేపట్టారు. గత ఏడాది ఖరీఫ్‌లో వివిధ పంటల సాగు అంచనాలు ఆధారంగా ఈ సంవత్సరం సాగు అంచనాలు ఇప్పటికే రూపొందించి ఉన్నతాధికారులకు స్థానిక మండల వ్యవసాయాధికారులు నివేదిక ఇచ్చారు.

తడ కుప్పంలో బంగారు నగలు చోరీ

తడ, మే 14 ప్రభాతవార్త : తడ పంచాయతీ పరిధిలోని తడకుప్పంలో పి.దేశప్పన్ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. స్థానికంగా ఒక కంపెనీలో పనిచేస్తున్న దేశప్పన్ రాత్రి ఇంటికి తాళం వేసి భార్య పిల్లలతో కలిసి మిద్దెపైకి వెళ్లి నిద్రించాడు. ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళాలు ఐరన్ రాడ్డుతో పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించామని తెలిపారు. బెడ్‌రూంలోని బీరువాలో దాచి ఉంచిన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు 57 వేల రూపాయలు విలువైన నగలు అపహరణకు గురైనట్లు దేశప్పన్ ఫిర్యాదు చేయడంతో తడ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎస్ఐ కొండప్పనాయుడు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోడిలింగాలపాడు వద్ద మోటార్‌బైక్ అపహరణ

తడ, మే 14 ప్రభాతవార్త : మండలం తడకండ్రిగ పంచాయతీ పరిధిలోని బోడిలింగాలపాడు వద్ద పార్కు చేసి ఉన్న బైక్ అపహరణకు గురైందని బుధవారం తడ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వరదయ్యపాలెం మండలం చిలమత్తూరుకు చెందిన ఆర్.జశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూళ్లూరుపేట ఆసుపత్రికి వెళుతూ తడ వద్ద సాయిబాబా టెంపుల్ వద్ద బైక్ పార్క్ చేసి వెనక్కి వచ్చేసరికి కనిపించలేదన్నారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీరంగపెరుమాళ్‌కు గంధాలంకారం పూజ

తడ, మే 14 ప్రభాతవార్త : మండలం వేనాడుదీవిలోని శ్రీరంగపెరుమాళ్ ఆలయంలో 36వ సంవత్సర లక్షార్చన పూజల్లో భాగంగా బుధవారం చివరిరోజు మహాతిరుమంజనం, గంధాలంకారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన మస్తాన్ మొదలి జ్ఞాపకార్థం వారి కుమారుడు డిల్లీబాబు ఉభయదాతగా ఈ కార్యక్రమాలు జరిగాయి. గ్రామంలోని ప్రముఖులతో పాటు భక్తులు గంధాలంకారం సేవలో పాల్గొన్నారు. మూడురోజులుగా జరిగిన ఈ ప్రత్యేక పూజలు బుధవారంతో ముగిసినట్లు గ్రామస్థులు తెలిపారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో పూజలను గ్రామంలోని ఒక ప్రధాన సామాజికవర్గం వారు ఉభయకర్తలుగా ఉండి కార్యక్రమాలు జరిపించారు.

ప్రశాంతంగా బిపి అగ్రహారం జాతర: చక్కటి ఏర్పాట్లు

శ్రీకాళహస్తి,మే 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పానగల్‌లోని బిపి అగ్రహారం గంగమ్మజాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు.మంగళవారం రాత్రి అమ్మవారిని చక్కగా అలంకరించి తెరతీసి గ్రామోత్సవం నిర్వహించారు. బిపి ఆగ్రహారం నుంచి బయలు దేరిన అమ్మవారు అగ్రహారం, శ్రీరామనగర్‌కాలనీ, బాలాజి కాలనీల్లో అమ్మవారి గ్రామోత్సవం సాగింది. జాతర సందర్భంగా పోలీసులు డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐలు డి.గోపి,నాగార్జునరెడ్డిల సారధ్యంలో చక్కటి బందోబస్తు నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చర్యలు తీసుకున్నారు.ఇక మునిస్సిపాలిటి శానిటరీ ఇన్స్పెక్టర్ బాల వారి సిబ్బందితో పారిశుద్ధ్యం చేపట్టారు.

మొక్కులు తీర్చుకున్న భక్తులు:

బుధవారం ఉదయం అమ్మవారిని అగ్రహారం స్థావరం వద్ద ప్రతిష్టించారు. ఉదయం నుంచి విచ్చల విడిగా జంతుబలులు సాగాయి.భక్తులు మొక్కులు తీర్చుకొనుటకు బారులు తీరారు. ఇక వేయికళ్ళలో దుత్తలతో వేపాకు చీరలు ధరించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, తెలుగుదేశంనాయకులు విందు వినోదాల్లో పాల్గొన్నారు. కాగా మాజీ ఎంఎల్ఏ బియ్యపు మధుసూధనరెడ్డి,మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. కమిటి యువకులు చక్కటి ఏర్పాట్లు చేసారు.

నిమజ్జనానికి తరలిన గంగమ్మ:

బిపి ఆగ్రహారంలో రెండు రోజుల పాటు అంగరంగవైభవంగా సాగిన గంగమ్మ జాతర బుధవారం రాత్రి భక్తి శ్రద్ధలతో నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. జాతరను కమిటి కి చెందినయువకులు మురళి, కందస్వామి, వెంకటమునిరెడ్డి, కృష్ణారెడ్డి,శివారెడ్డి,పొలూరు శ్రీనివాసులురెడ్డి, మునిరాజాయాదవ్, కాళప్పరెడ్డి, ఎంఎస్‌రెడ్డి,ప్రతాప్,నాగరాజులు జాతర నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ సాగించారు.

సిఎం నివాస ప్రాంతాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

శాంతిపురం, మే 14 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబు నాయుడు ఈనెల 25వతేది మండలంలోని శివపురం సమీపంలో నిర్మిస్తున్న సొంత ఇంటి గృహ ప్రవేశంకు విచ్చేయనున్న నేపథ్యంలో బుధవారం సిఎం చంద్రబాబు నివాసాన్ని, పరిసర ప్రాంతాలను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. సిఎం రాక సందర్భంగా జనం ఎక్కువగా చేరే ప్రాంతాలు, రూట్‌మ్యాప్, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ వసతి, ఫైర్ సేఫ్టీ, అంబులెన్స్ ఏర్పాట్లు తదితరాలపై సమీక్షించారు. పర్యటనకు సంబంధించి భద్రత, బలగాల ఏర్పాట్లు తదితరాలపై దిశానిర్దేశం చేశారు. స్థానిక పోలీసు అధికారులు, ఇంటెలిజెన్స్, ఎస్‌బి బలగాలతో కలసి సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సిఎం పర్యటన సజావుగా సాగేలా అన్